క్లుప్తంగా

శ్రీదత్తసాయికి వెండి కిరీటం బహూకరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బాబా వారికి దాత వెన్నవల్లి సాంబశివరావు, శ్రీదేవి దంపతులు కిలో పావు వెండి కిరీటాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. దాత సాంబశివరావు మాట్లాడుతూ మహిమాన్వితమైన బాబావారికి వెండి కిరీటం అందజేస్తున్నానని తెలిపారు. దాతలను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు.

జీజీహెచ్‌కు రెడ్‌క్రాస్ ఐదు వీల్‌చైర్‌ల వితరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నడవలేని రోగులను ఒకచోట నుంచి మరోచోటకు తరలించడానికి ఉపయోగపడేలా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఐదు వీల్‌చైర్‌లను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి అందజేశారు. రెడ్‌క్రాస్‌సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. వెంకటేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ శ్యామ్‌కుమార్, ఆర్‌ఎంఓలు నాగేశ్వరరావు, సూర్యమంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులపై నివేదికలివ్వండి




పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, 125 అడుగుల విగ్రహ నిర్మాణాల్లో జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్టర్ నిరంతరం నివేదికలు ఇవ్వాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ డిజైన్ల ఆధారంగా పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని, సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా చేస్తున్నామన్నారు. గ్రానైట్ ఫుట్పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయి. పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగంణంలో రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

మిడోస్ టెన్నిస్ లీగ్‌లో నగర క్రీడాకారుల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: మిడోస్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో నగర క్రీడాకారులు కె.గిరీష్, ఎం.ప్రణీత్ సత్తా చాటారు. విశాఖపట్నం భీమిలిలోని మిడోస్ స్పోర్ట్స్ విలేజ్ టెన్నిస్ కోర్టుల్లో ఈ నెల 1,2 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. రూరల్ నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమిలో శిక్షణ పొందుతున్న గిరీష్, ప్రణీత్‌లు డబుల్స్ విభాగంలో ప్రాతినిధ్యం వహించి విన్నర్ టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. విజేతలను అకాడమీ నిర్వాహకులు కె.గోపాలరావు, కోచ్‌లు నగేష్,రవి అభినందించారు. పలుచోట్ల జరిగిన పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారని తెలిపారు.

ఆలయంలో అన్నసమారాధన



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం అన్నమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ భక్తులు చేశారు. దేవస్థానంలో శ్రీ పార్వతీ అమ్మవారికి శాకంబరి ఉత్సవాలు జరుగుతుండటంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. దాదాపు రెండు వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా



రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు



బీసెంట్‌రోడ్డులో జరిగిన అన్నదానంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏపీ ప్రణాళికాబోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మధురానగర్ శివాలయం సెంటర్ సమీపంలో మంగళవారం 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ఆధ్వర్యాన వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమం జరిగింది. రంగా విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్‌ను కోసి మిఠాయిలు, పండ్లు పంచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, పిల్లి కృష్ణవేణి, కోలా రమేష్, శీమల గోవిందు, కొంగితల సుధాకర్, తుంపాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీతోటలో..

27వ డివిజన్ గులాబీతోటలో యర్రంశెట్టి శ్రీను ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండాయగుంట బలరామ్, రంగా అభిమానులు పాల్గొన్నారు.

దేవీనగర్‌లో..

దేవీనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో దేవీనగర్ కాపు సేవాసంఘం ఆధ్వర్యాన రంగా జయంతి జరిగింది. రంగా విగ్రహానికి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగారావు అని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మంగళవారం 62వ డివిజన్ పైపులరోడ్డు జంక్షన్, పాయకాపురంలో వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే విష్ణు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, బీహెచ్ఎస్వీ జానారెడ్డి, నేతలు అలంపూరు విజయ్‌కుమార్, ఉమ్మడి వెంకట్రావు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తోట శ్రీను, నాయకులు

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): సత్యనారాయణపురంలో ఎన్నార్పీ రోడ్డులోని రంగా అభిమాన సంఘం నాయకులు దాసరి శ్రీనివాసు ఆధ్వర్యంలో మంగళవారం వంగవీటి మోహన రంగా 76వ జయంతి వేడుకలు నిర్వహించారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంచారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాదెండ్ల రవి శంకర్, ఉప్పు రంగాబాబు, వెంకన్న, కమ్మిలి రత్నకుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చిరస్థాయిగా..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి వీఎంసీ రంగా అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా 76వ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు బల్లం కిషోర్ ఆధ్వర్యాన సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. తొలుత రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అభిమానులతో కలిసి కేక్ కోసి, పండ్లు పంచారు. నిరుపేదలకు అన్నదానం చేశారు. నేతలు అన్నపురెడ్డి రామిరెడ్డి, దాసం దుర్గారావు, కె.ఫణికుమార్, కె.హరి, డి.అశోక్, ఎస్‌కే రబాబ్బి, శ్రీనివాసరావు, భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎన్‌పురంలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వంగవీటి మోహన రంగా జీవిత ఆశయాలు ఆదర్శనీయమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వీఎం రంగా జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కోఆప్షన్ సభ్యులు అలీం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, చింతా శ్రీను, గెల్లిపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): రంగా సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ ఎస్‌సీసెల్ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ అన్నారు. 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు నాగుల్ మీరా, నేతలు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్‌రోడ్డులో మంగళవారం వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే విష్ణు నివాళులు అర్పించారు.

మిఠాయిలు పంచారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దమ్మాల మల్లికార్జునరావు, చెన్నుపాటి శ్రీను, ఒగ్గు విక్కీ, చల్లా సుధాకర్, ఒగ్గు గణేష్, దర్శి వాసు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో దేశానికి సేవలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. క్షత్రియ సేవా సంఘం, యువజన సంఘం ఆధ్వర్యాన మంగళవారం అయోధ్యనగర్ క్షత్రియ సేవా సంఘం భవనంలో అల్లూరి సీతారామరాజు 125 వ జయంతి ముగింపు ఉత్సవాలు జరిగాయి. ఆయన విప్లవ వీరుడు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించిన మహోన్నత ధీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన తెలుగువారు కావటం గర్వకారణంగా పేర్కొన్నారు. అనంతరం రోటరీ క్లబ్, క్షత్రియ యువజన సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వృద్ధులు మహిళలకు చీరలు, పింఛన్లు పంపిణీ చేశారు. తొలుత బుడమేరు వంతెన సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెనుమత్స శిరీష, దాతలు కలిదిండి రామచంద్ర రాజు, రుద్రరాజు వెంకట సుబ్బరాజు, క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు టీవీఎస్ ఆంజనేయరాజు, కార్యదర్శి కేఎస్ ప్రసాదరాజు, సభ్యులు, యువజన సంఘం అధ్యక్షుడు వి.రామరాజు, కార్యదర్శి దాట్ల రాజేష్ వర్మ, సంఘం పెద్దలు సాగి భగవాన్‌రాజు, అల్లూరి సీతారామ రాజు సాంస్కృతిక సంఘం అధ్య క్షు లు ఎస్‌వెంకటేశ్వర రాజు, పెనుమత్స సత్యం తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ శాఖా గ్రంథాలయంలో మంగళవారం అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ 27 ఏళ్ల వయసులోనే చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్యాన్నే ఢీకొన్న గొప్ప వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ప్రణీత, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, అమరావతి: నగరంలోని సీఆర్డీఏ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అదనపు కమిషనర్ కట్టా సింహాచలం, మరో అదనపు కమిషనర్ అలీం బాషాతో కలిసి ఆయన అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సీఆర్డీఏ జాయింట్ డైరెక్టర్లు చిరంజీవి, డేవిడ్ రాజు, ప్లానింగ్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో గిరిజన హక్కులు కాపాడుతున్న జగన్

సాక్షి, అమరావతి: మన్య ప్రజల హక్కుల కోసం, వారి రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అల్లూరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి శంకర్ నాయక్ అంజలిఘటించారు. అల్లూరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి, వారి హక్కుల రక్షణకు విప్లవాత్మక చర్యలు చేపట్టారని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ డెప్యూటీ డైరెక్టర్ పొట్లూరి పద్మావతి, జి.అరుణ, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు, పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్



సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ రాణా

కమిషనరేట్‌లో..

విజయవాడస్పోర్ట్స్: అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీలు విశాల్‌గున్ని, వి.అజిత పూలమాలలు వేసి నివాళులర్పించారు

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె..



ఉత్సవ మూర్తికి సారె సమర్పణ



సారె సమర్పణకు ఆలయానికి చేరుకున్న పాలక మండలి సభ్యురాలు ఉదయలక్ష్మి బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం సందర్భంగా దుర్గమ్మకు మంగళవారం పలువురు భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించారు. సమర్పణకు పెద్ద ఎత్తున భక్త బృందాలు, భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు అనుమోలు ఉదయలక్ష్మి బృందం, విజయవాడలోని అవధూత దత్తపీఠానికి చెందిన జేవీ ప్రసాద్‌కు చెందిన వంద మంది భక్త బృందం, కనకలక్ష్మి బృందానికి చెందిన 80మంది, నిరషా బృందానికి చెందిన 60 మంది, డి.లక్ష్మి బృందానికి చెందిన 50 మందితో పాటు పలు భక్తబృందాలు సారెను సమర్పించారు. వారికి ఆలయ కమిటీ ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను ఇచ్చి ఆలయ ప్రాంగణంలో ముత్తైదువలు పసుపు, కుంకుమ, పూజా సామిగ్రిని పంపిణీ చేశారు.

నేటి నుంచి 30వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ 247వ సచివాలయం పరిధిలో బుధవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని కార్పొరేటర్ జానారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు దేవీనగర్ ఒకటోలైను నుంచి జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం ఓగిరాలలోని ఎంపీపీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా నోట్ పుస్తకాలు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య ఆర్థికసాయంతో గ్రామంలోని రెండు ఎంపీపీ స్కూళ్లలో చదువుతున్న 105 మంది చిన్నారులకు వీటిని పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం, సర్పంచ్ కగ్గా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి వ్యక్తి కాదు.. శక్తి



ఆనంద్‌ను సత్కరిస్తున్న గోకరాజు గంగరాజు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఒక వ్యక్తి కాదని ఒక శక్తి అని ఆయన స్ఫూర్తితో యువత దేశానికి సేవ చేయాలని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. ముత్యాలంపాడు గోకరాజు రంగరాజు కళ్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన అల్లూరి జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్పొరేటర్లు పెనుమత్స శిరీష, శర్వాణీ మూర్తి, సాగి భగవాన్‌రాజు మాట్లాడారు. అనంతరం రంగస్థల నటుడు, రచయిత ఏబీ ఆనంద్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంఎస్ ఇమామ్ బాషా, ప్రముఖ న్యాయవాది కాకర్లపూడి శ్రీనివాస సుధాకర్‌రాజులను ఘనంగా సత్కరించారు. అక్కడ జరిగిన నృత్య ప్రదర్శన అలరించింది. ఉదయం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పంపిణీ చేశారు, కార్యక్రమంలో శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరాజు కార్యదర్శి భాస్కరరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, సంయుక్త కార్యదర్శి కేఎస్ ప్రసాదరాజు, అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం అధ్యక్షులు పీవీ సుబ్బరాజు, కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే లౌకిక రక్షణ

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్




ఫోర్మెన్ బంగళా వద్ద ముస్లింలతో గౌస్‌మొహిద్దీన్

విద్యాధరపురం కాదు — విించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే మరోవైపు లౌకిక ప్రభుత్వంగా మైనార్టీల హక్కులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాపాడుతోందని జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం 'హర్ దిల్ మే వైఎస్సార్' కార్యక్రమంలో భాగంగా గౌస్‌మొహిద్దీన్ మంగళవారం ఫోర్మెన్ బంగళా ఎర్రకట్ట సమీపంలోని అక్బరీ మసీదు వద్ద స్థానిక ముస్లిం పెద్దలు, మసీదు బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ మసీదు ఇమామ్, మౌసన్ల జీతాలు, షాదీ తోఫా, నవరత్నాల వంటి పథకాలతో సంక్షేమ కార్యక్రమాలని అమలు చేస్తున్నారన్నారు. మరో పక్క మైనారిటీలకు భద్రతకు ముప్పుగా పరిణమించిన ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా అసెంబ్లీలో బిల్లు పెట్టి, దాన్ని ఆమోదింపజేసి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ముస్లింలు మద్దతివ్వాలని కోరారు.

అనంతరం సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు, మైనారిటీ నాయకులు షేక్ సలీం, సుభాని ఖాన్,షేక్ బడేమియా, షేక్ బాజి షహీద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ బీసీ–బీగా కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్



జస్టిస్ శంకర్ నారాయణకు వినతిపత్రం ఇస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ ప్రజలకు 'విశ్వబ్రాహ్మణ బీసీ–బీ'గా కుల ధ్రువీకరణ పత్రంలో పేర్కొనాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం విజయవాడలోని ఏపీ బీసీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎ.శంకర్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లోని విశ్వబ్రాహ్మణులు కంసాలి, వడ్ల, ఆచారి, కమ్మర, అంసుల ఇలా పలు పేర్లతో పిలుస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో అదే పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ గెజిట్‌లో కుల ధ్రువీకరణ పత్రంలో ఒక్క విశ్వబ్రాహ్మణ బీసీ–బీ, సీరియల్ నెంబర్ 21 అని మాత్రమే ఉండేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని గతంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని, దానిని పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన జస్టిస్ శంకర్ నారాయణ కమిషన్ సభ్యులతో చర్చించి చర్యలు చేదతామని అన్నట్లు శ్రీకాంత్ చెప్పారు.


రేపటి నుంచి మంగళంపల్లి జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జయంతి వేడుకలను ఈ నెల 6, 7 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం శ్రీ'రామరస' ఆధ్వర్యాన శివరామక్షేత్రంలో కస్తూరి గోపాలరావు గాత్ర కచేరి నిర్వహిస్తున్నట్లు రామసరసి ప్రధానకార్యదర్శి డాక్టర్ సీఎల్‌వీ కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వరఝరి ఆధ్వర్యంలో 7వ తేదీ సాయంత్రం గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై రాత్రి 7 గంటలకు బాలమురళీకృష్ణ శిష్యులు డీవీ మోహనకృష్ణతో గురు శిష్య సంబంధం– మురళితో అనుబంధం అంశంగా ఇష్టాగోష్టి ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు. బాలమురళితో అనుబంధం ఉన్నవారు వారి శిష్య ప్రశిష్యులు పాల్గొంటారని వివరించారు.

ఆటో అద్దాలు పగలగొట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటి ముందు నిలిపిన ఆటో అద్దాలు పగలగొట్టిన వ్యక్తిపై ఆటో యజమాని ఫిర్యాదుపై మంగళవారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పున్నాన దుర్గారావు న్యూ రాజీవ్‌నగర్ ఆటో నడుతున్నాడు ఏపీ16టీజే3685 నంబరున్న ఆటోను తన ఇంటి ముందు నిలుపుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆటోను పార్కింగ్ చేయగా రాత్రి 11 గంటల ప్రాంతంలో రూపేష్ అనే వ్యక్తి ఇటుక రాయితో ఆటో అద్దాలు పగలగొట్టినట్టు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రౌడీషీటర్ నగర బహిష్కరణ



విజయవాడ స్పోర్ట్స్: కొత్తపేటకు చెందిన రౌడీషీటర్ పోలవరపు సాయికుమార్ అలియాస్ అగ్గిపుల్ల సాయిని ఆరు నెలల పాటు నగరం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట రాజగిరి వీధికి చెందిన సాయికుమార్ గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించాడు. ఆ తర్వాత అతని ప్రవర్తనలోమార్పు రాలేదని, గతంలో మాదిరిగానే నగరంలో అల్లర్లు సృష్టిస్తూ, వివాదాలకు, సంఘ వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్నాడని సీపీ రాణా తెలిపారు. ఈ నేపథ్యంలో నగర ప్రజల శాంతిభద్రతల దృష్ట్యా రౌడీ షీటర్ సాయిని నగరం నుంచి బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనం అమలు తీరు పరిశీలన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందని బాపులపాడు ఎంఈవో–2 సురేష్ కుమార్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మధ్యాహ్న భోజనం పథకం పనితీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి జగనన్న గోరుముద్దపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

